క్లుప్తంగా

ఫార్మసీ రంగంలో మెడికల్ కోడింగ్ కీలకం

రాజానగరం: ఫార్మసీ రంగంలో మెడికల్ కోడింగ్ ప్రముఖ పాత్ర పోషిస్తుందని దివాన్ చెరువులోని వీజేసీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.నరేంద్ర అన్నారు. కళాశాలలో డివైన్ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో 'మెడికల్ కోడింగ్'పై శుక్రవారం అవగాహన కార్యక్రమం జరిగింది. మెడికల్ కోడింగ్ ప్రత్యేకతను, కోడింగ్‌ని ఏ విధంగా వినియోగించుకోవచ్చునో ఆ సంస్థ ప్రతినిధులు శేఖర్, దీపిక వివరించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్‌వీవీ జగన్‌మోహన్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతిలో వరి సాగు చేపట్టాలి


వెలుగుబందలో నారుమడులను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

రాజానగరం: ప్రస్తుత సార్వా సీజన్‌లో వరి సాగును శాస్త్రీయ పద్ధతిలో చేపట్టాలని దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వీర వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనవాస్ అన్నారు. నరేంద్రపురం, వెలుగుబంద, దోసకాయలపల్లి, కోటి కేశవరాల్లోని పలు వ్యవసాయ క్షేత్రాలను శుక్రవారం సందర్శించారు. విత్తన శుద్ధి, నారు మడి యాజమాన్యం, జింకు లోపం నివారణ చర్యలు, ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు ముంద్రు వీరభద్రరావు, విస్సా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి

కోరుకొండ: దివంగత ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని కోరుకొండలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు బొండాడ చందు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్


స్వాధీనం చేసుకున్న సారాతో ఎక్సైజ్ అధికారులు

సీతానగరం: రఘుదేవపురం, సీతానగరాల్లో సారా విక్రయిస్తున్న అమ్ముతున్న ఇద్దరిని అరెస్ట్ చేశామని కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బాలాజీ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ రఘుదేవపురంలో సారా అమ్ముతున్న దియ నాగమణిని అదుపులోకి తీసుకుని, ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. సీతానగరంలో గుత్తుల దుర్గాభవాని సారా అమ్ముతుండగా అదుపులోకి తీసుకుని, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇరువురిపై కేసులు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం

బిక్కవోలు: పరిసరాల పరిశుభ్రతతో దోమల వల్ల వచ్చే వ్యాధులను అరికట్టవచ్చని కొంకుదురు పీహెచ్‌సీ వైద్యులు జి.విజయలక్ష్మి అన్నారు. కొంకుదురులో శుక్రవారం డెంగీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంకుడు గుంతలు, మురుగు గుంటలు, నీరు నిల్వ ఉండే ప్రాంతాలు, ఖాళీ కొబ్బరి బొండాలలో దోమలు దాగి ఉంటాయన్నారు. వీటి వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలుతాయన్నారు. గ్రామ సర్పంచి సత్తి వీరమణి, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుల పరిశీలన

బిక్కవోలు: గ్రామాల్లో పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. ఆర్‌ఎస్‌పేట, బలభద్రపురం, కాపవరం, కొమరిపాలెం, తోస్సిపూడి గ్రామాల్లోని డంపింగ్ యార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. గ్రామాల్లో వాటర్ పైపులైన్లకు లీకేజీలు లేకుండా చూడాలన్నారు.

పౌరసరఫరాలశాఖ అధికారిగా పార్వతి



రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి (డీఎస్‌వో)గా వి.పార్వతి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం డీఎస్‌వో కార్యాలయంలో సహాయ పౌరసరఫరాలశాఖ అధికారిగా పనిచేస్తూ డీఎస్‌వోగా పదోన్నతిపై ఇక్కడి వచ్చారు. ఇప్పటి వరకూ ఇన్‌చార్జి డీఎస్‌వోగా బాధ్యతలు స్వీకరించిన గెయిల్ డిప్యూటీ కలెక్టర్ ప్రేమ్‌కుమార్ నుంచి వి.పార్వతి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ పి.ప్రశాంతి, జేసీ ఎస్ చిన్నరాముడును ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

హైవే బ్లాక్.. జర్నీ బ్రేక్


జీఎస్ఎల్ సమీపంలో జాతీయ రహదారిపై పెట్టిన స్టాపర్లు


దివాన్ చెరువు రిజర్వు ఫారెస్టు వద్ద జంగిల్ క్లీనింగ్ చేస్తూ రహదారిపై పెట్టిన స్టాపర్లు

- జాతీయ రహదారిపై స్టాపర్లు
- పనులు చేసేచోట పెడితే తప్పులేదు
- దాదాపు కిలోమీటరు మేర రోడ్డును బ్లాక్ చేస్తున్న వైనం
- ప్రయాణికుల అవస్థలు

రాజానగరం: ప్రమాదాల నివారణలో భాగంగా రోడ్లపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తుంటారు. కానీ జాతీయ రహదారిపై మాత్రం అందుకు అవకాశం ఉండదు. స్పీడ్ బ్రేకర్లు లేకపోతే ఏమీ, మేమున్నాం కదా అంటోంది జాతీయ రహదారి నిర్వహణా విభాగం. రహదారిపై మరమ్మతులు, క్లీనింగ్, పెయింటింగ్ వంటి వివిధ రకాల పనులు చేసే సిబ్బంది భద్రత పేరుతో ఏర్పాటు చేస్తున్న స్టాపర్లు పలుచోట్ల ప్రయాణికుల సహనాన్ని పరీక్షిస్తున్నాయి.

ప్రయాణికుల ఇబ్బంది

జాతీయ రహదారిపై ముఖ్యంగా రాజమహేంద్రవరం నుంచి రాజానగరం వరకూ సుమారు 25 కిలోమీటర్ల పైబడి ప్రయాణికులు తరచూ ట్రాఫిక్ అంతరాయాలను ఎదుర్కోవాల్సి వస్తోంది. జిల్లాలో రావులపాలెం నుంచి తుని వరకు సుమారు 130 కిలోమీటర్ల మేర 16వ నంబరు జాతీయ రహదారి ఉంది. ప్రస్తుతం ఈ రహదారిపై పడిన గోతులను పూడ్చడం, డివైడర్లకు రంగులు వేయడం, రహదారి పక్కన పెరిగిపోతున్న పిచ్చిమొక్కలు, తుప్పలు తొలగించడం వంటి పనులు చేపడుతుంటారు. ఈ సమయంలో ఆయా పనులు జరిగే చోట రహదారిపై స్టాపర్లు పెట్టి వాహనాల రాకపోకలను నిరోధిస్తున్నారు. సాధారణంగా పైన పేర్కొన్న పనులు చేసే ప్రాంతంలో స్టాపర్లు ఏర్పాటు చేస్తే ఫర్వాలేదు. కానీ రహదారిపై ఆయా పనులు చేసే ప్రాంతానికి పర్లాంగు దూరం పైబడి స్టాపర్లు పెట్టి, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నారని ప్రయాణికులు విమర్శిస్తున్నారు.

తప్పని తిప్పలు

జాతీయ రహదారిపై 108 వంటి అత్యవసర వాహనాలకు కూడా ట్రాఫిక్ జామ్ ఇబ్బందులు తప్పడం లేదు. సాధారణంగా జంక్షన్ల వద్ద సిగ్నల్స్ పడినా, రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడిన సమయాలలో కూడా అత్యవసర వాహనాలకు ఏదొక విధంగా మార్గం ఇవ్వాలని రోడ్డు భద్రతా నిబంధనలు చెపుతున్నాయి. అయినా ఇష్టానుసారంగా ఏర్పాటుచేసే స్టాపర్లతో ఆ నిబంధనలు ఆచరణకు సాధ్యం కావడం లేదు.

రద్దీని దృష్టిలో పెట్టుకోవాలి



జాతీయ రహదారిపై పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుంటే ఇటువంటి సమస్యలు ఉండవు. ఎక్కడైతే రహదారి నిర్వహణ పనులు చేస్తున్నారో ఆ ప్రాంతానికి కొద్ది అటూ ఇటూగా బ్లాక్ చేయడం సమంజసం. పర్లాంగులకు పర్లాంగుల దూరం రహదారిని బ్లాక్ చేయడం వలన రద్దీ పెరిగి, ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి.

– గంగిశెట్టి సోమేశ్వరరావు, దివాన్ చెరువు

ప్రమాదాలు జరిగే అవకాశం



జాతీయ రహదారిపై నిర్వహణ పనులు చేసే సమయంలో సిబ్బంది మీదకు వాహనాలు రాకుండా స్టాపర్లు పెట్టి రక్షణ కల్పిస్తుంటారు. అయితే ఆ పనులు చేసే ప్రాంతం కంటే ఎక్కువ దూరం స్టాపర్లు పెట్టి, రహదారిని బ్లాక్ చేయడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడటానికి కారణమవుతుంది. ఒక్కోసారి ఇది ఊహించని ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉంది.

– పెంటగట్ల రామకృష్ణ, సంపత్‌నగరం

తడి, పొడి చెత్తపై అవగాహన అవసరం


కైకవోలులో మహిళలతో మాట్లాడుతున్న ఎంపీడీవో నరేంద్రరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో ప్రజలు తడి, పొడి చెత్తపై అవగాహన పెంచుకుని, వాటిని వేర్వేరుగా క్లాప్ మిత్రాలకు ఇవ్వాలని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. కైకవోలు గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానంపై శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ముందుగా పోస్టర్లను ప్రజలకు పంపిణీ చేశారు. నరేంద్రరెడ్డి మాట్లాడుతూ క్లాప్ మిత్రలు తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తారన్నారు. అక్కడ ఎరువుగా తయారీ చేసి రైతులకు విక్రయిస్తారన్నారు. తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. అలాగే పెద్దాడ గ్రామంలో డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి ప్రజలకు అవగాన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, శ్రీనువాసు సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదల ఆశాజ్యోతి వంగవీటి రంగా


సంపరలో రంగా విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ముక్తేశ్వరరావు


కాపవరంలో రంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న సర్పంచి వెంకట రమణ

పెదపూడి: దివంగత మాజీ ఎమ్మెల్యే, కాపు నేత వంగవీటి మోహన రంగా నిరుపేదల ఆశాజ్యోతి అని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు అన్నారు. రంగా జయంతిని శుక్రవారం సంపర గ్రామంలో నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిచారు.

నేటి తరానికి ఆదర్శం

బిక్కవోలు: వంగవీటి మోహన రంగా జీవితం నేటి తరానికి ఆదర్శమని కాపవరం సర్పంచి సత్యంశెట్టి వెంకట రమణ అన్నారు. ఆ గ్రామంలోని రంగా విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. వంగవీటి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలన్నారు.

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో వంగవీటి మోహనరంగా జయంతి ఘనంగా నిర్వహించారు. ఇనుగంటివారిపేట, ముగ్గళ్ల, రాపాక గ్రామాల్లో ఆయన చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాపాకలో యువకులు బైక్ ర్యాలీ చేశారు.

ఎన్నికల హామీలను ఎమ్మెల్యే నెరవేర్చాలి


సమావేశంలో పాల్గొన్న సీపీఐ ఎంఎల్ నాయకులు

సీతానగరం: ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తక్షణమే నెరవేర్చాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలవెల వీరబాబు డిమాండ్ చేశారు. సీతానగరంలోని రాజుగారి కల్యాణ మంటపంలో శుక్రవారం సీపీఐ ఎంఎల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పార్టీ వ్యవసాయ సంఘం స్టేట్ ప్రెసిడెంట్ వేగిపాటి అర్జునరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వ, మిగులు, సీలింగ్ భూములను పేదలకు అందించాలన్నారు. రోడ్లను అభివృద్ధి చేయాలన్నారు. ప్రజలను మోసం చేయడంలో నంబర్ వన్‌గా స్థానిక ఎమ్మెల్యే నిలిచారన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ


కోరుకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కోరుకొండ: డెంగీతో అప్రమత్తంగా ఉండాలంటూ శుక్రవారం కోరుకొండలో ర్యాలీ నిర్వహించారు. జంబూపట్నంలోని పీహెచ్‌సీ నుంచి ప్రారంభమైన ర్యాలీ గ్రామంలోని ప్రధాన వీధుల మీదుగా జరిగింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం, మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకుందామని నినాదాలు చేశారు. పీహెచ్ డాక్టర్ జ్ఞానచంద్ర మాట్లాడుతూ పాత కుండీలు, ఉపయోగించని డబ్బాలు, పెద్ద టిన్లలో వర్షం నీరు ఎక్కువ కాలం నిల్వ ఉండటంతో డెంగీ దోమ తయారవుతోందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

కూటమి పాలనలో అందరికీ కష్టాలే

- బూటకపు హామీలతో మోసం చేసిన చంద్రబాబు
- రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు వేణు
- అనపర్తిలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' సమావేశం


మ్యానిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తూ, చంద్రబాబు మోసాలను వివరిస్తున్న మాజీ మంత్రి వేణు

అనపర్తి: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా రాష్ట్రంలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరని, అందరూ కష్టాలు పడుతున్నారని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అధ్యక్షతన గురువారం బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి వేణు, పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు తిప్పల గురుమూర్తిరెడ్డి హాజరయ్యారు.

అటకెక్కిన సూపర్ సిక్స్ : మాజీ మంత్రి వేణు

మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ప్రజలకు మేలు చేసే పథకాలకు రూపకల్పన చేసి, వాటిని చిత్తశుద్ధితో అమలు పరచిన ఘనత మాజీ ముఖ్యమంత్రులు డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహనరెడ్డిలకే దక్కుతుందన్నారు. రాజశేఖరరెడ్డి తన ఐదేళ్ల పాలనలో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108, 104 పథకాలను అమలు చేశారన్నారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి వాటికి అదనంగా అమ్మ ఒడి, రైతు భరోసా, రూ.25లక్షల ఆరోగ్యశ్రీ భరోసా వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారు. నలభై ఏళ్ల ఇండస్ట్రీగా చెప్పుకునే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనలో చెప్పుకోవడానికి ఒక్క పథకం కూడా లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అటకెక్కించారన్నారు. చంద్రబాబు చేస్తున్న మోసాన్ని ప్రజలకు తెలియజేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు సూచించారు. కూటమి తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేయడానికి మ్యానిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ప్రతి ఒక్కరికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం: మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతు రాష్ట్రంలో రాజకీయాలకు భిన్నంగా అనపర్తిలో రాజకీయాలు సాగుతున్నాయన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తన అధికారాన్ని ఉపయోగించి, ఏడాదిగా నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు చేయిస్తున్నారన్నారు. పార్టీ మారాలని బెదిరిస్తున్నారన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డికే పలు మార్లు బెదిరింపు ఫోన్లు చేయడం, ఆయన ఇంటికి మనుషులను పంపి బెదిరించడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వానికి హనీమూన్ పీరియడ్ అయిపోయిందని, ఇకపై ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదన్నారు. ఎవరికి ఏ కష్టమొచ్చినా తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. స్థానిక ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి మట్టి దోపిడీపై మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు.

బెదిరింపులకు భయపడబోం: డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

స్థానిక బీజేపీ ఎమ్మెల్యే బెదిరింపులకు భయపడేది లేదని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కక్షపూరితంగా దాడులు చేస్తున్నారన్నారు. అయినప్పటికీ నియోజకవర్గంలో జరిగే వైఎస్సార్ సీపీ కార్యక్రమాలకు జనం భారీగా హాజరై విజయవంతం చేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంతకు ఇంత ప్రతికార చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కూటమి నాయకులు ఎన్నికల సమయంలో ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చారన్నారు. వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారు. నియోజకవర్గంలో రైతులకు ధాన్యం సొమ్ము సుమారు రూ.50 కోట్లు ప్రభుత్వం బకాయి పడిందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలను అరకొర ఇచ్చారన్నారు.

పార్టీ పటిష్టతకు కృషి : గురుమూర్తిరెడ్డి

పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు వేణు, యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటు పార్టీ పటిష్టతకు కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటారన్నారు. ప్రజలతో మమేకమైన అతికొద్ది మంది నాయకులలో ఆయన ఒకరన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. సమావేశంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల పార్టీ కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి, పోతుల ప్రసాదరెడ్డి, గుత్తుల వెంకటరమణ, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, చిత్రంలో జక్కంపూడి రాజా, సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ శ్రేణులు

'అల్లూరి' పోరాటం ఆదర్శనీయం

- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ
- ఘనంగా మన్యం వీరుని జయంతి


అల్లూరి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ, తదితరులు

రాజానగరం: స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు పోరాటం ఆదర్శనీయమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. అల్లూరి జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీలోని ఈసీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: మన్యం వీరుడు అల్లూరి నేటి తరానికి స్ఫూర్తిప్రదాత అని కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీ సరోజ అన్నారు. బస్టాండ్ సెంటర్‌లోని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. చీర్ల రాధాకృష్ణ, పచ్చారి నరసింహమూర్తి, కర్రి గణేష్ పాల్గొన్నారు.

సీతానగరం: అల్లూరి సీతారామరాజు పోరాట పటిమను యువత ఆదర్శంగా తీసుకోవాలని చినకొండేపూడి క్షత్రియ సంఘం సభ్యులు అన్నారు. మదపాటి జగపతి రాజు, చిరువూరి మణిరాజు, వడ్లమూరి రామకృష్ణంరాజు, కోసూరి నాగరాజు, వడ్లమూరి రామరాజు తదితరుల ఆధ్వర్యంలో చినకొండేపూడిలోని మహాలక్ష్మి ఆలయం సెంటర్, నాలుగు బొమ్మల సెంటర్, సూర్యచంద్ర స్కూల్ దగ్గరలోని సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోరాట యోధుడు అల్లూరి

పెదపూడి: ఆదివాసీలపై జరుగుతున్న బ్రిటీష్ దోపిడీకి వ్యతిరేకంగా, ప్రాణాలకు తెగించి పోరాడిన గొప్ప యోధుడు అల్లూరి సీతారామాజు అని ఎంపీడీఓ కొవ్వూరి నరేంద్రరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసు, సిబ్బంది పాల్గొన్నారు.

- జి.మామిడాడలో సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలు ఆదర్శనీయమని బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ మురమళ్ల వెంకటరమణ అన్నారు.

రంగంపేట: కోటపాడులో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మండల బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ పార్టీ స్టేట్ కౌన్సిల్ మెంబరు మండవిల్లి గుప్తా, మండల అధ్యక్షుడు ఎం.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

- రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ మండల శాఖ ఆధ్వర్యంలో అల్లూరి జయంతి నిర్వహించారు.

బిక్కవోలు: సీతారామరాజు విప్లవ స్ఫూర్తి, పోరాట పటిమ, దేశభక్తి నేటి యువతకు ఆదర్శం కావాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. బిక్కవోలు మండల పరిషత్ కార్యాలయం వద్ద అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పరిపాలన అధికారి వీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- మెల్లూరు ఉన్నత పాఠశాలలో అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. పింగళి వెంకటయ్య వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. హెచ్‌ఎం జి.లక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కోరుకొండ సెంటర్‌లో అల్లూరి విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు


చినకొండేపూడిలో నాలుగు బొమ్మల సెంటర్ వద్ద..


పెదపూడి మండల పరిషత్ కార్యాలయంలో..


బిక్కవోలులో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు


రంగంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద..